
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
బుధవారం 26 జూన్ 2024



దొరకని చిరుత ఆచూకీ

శంషాబాద్ రూరల్, జూన్ 25 : మూడు రోజులుగా అటవీశాఖ అధికారులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపటినా చిరుత ఆచూకీ మాత్రం దొరకడం లేదు. దీంతో శంషాబాద్ మండలం ఘాన్సిమియాగూడ, శంకరపురం గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు మాత్రం మంగళవారం మరో పది ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి చిరుత ఆనవాళ్లు దొరకలేదని, అది ఎక్కడున్నా చెరువు, కుంట వద్దకు నీళ్ల తాగడానికి వస్తుందని అధికారులు చెప్పారు. చిరుతను త్వరలోనే పట్టుకుంటామని అటవీశాఖ అధికారులు చెప్పారు.

బంగారాన్ని కరిగించి పేస్టుగా మార్చి..
అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టివేత
- రూ.58.8 లక్షల విలువైన 806 గ్రాములు సీజ్



పట్టుబడిన బంగారం

శంషాబాద్ రూరల్, జూన్ 25 : బంగారాన్ని కరిగించి పేస్టుగా మార్చి.. అక్రమంగా తరలిస్తుండగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రయాణికుడు అబుదాబి నుంచి మంగళవారం తెల్లవారుజామున శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు బ్యాగులు తనిఖీ చేయగా 806 గ్రాముల బంగారం పట్టుబడింది. బంగారానికి సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. పట్టుబడిన బంగారం విలువ దాదాపు రూ.58.8 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. బంగారాన్ని కరిగించి పేస్ట్‌గా మార్చి తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. నిందితుడిని నగరంలోని కస్టమ్స్ కార్యాలయానికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కస్టమ్స్ అధికారులు వెల్లడించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

- జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జూన్ 25 : చిన్నారులకు పౌష్టికాహారం అందివ్వాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులతో తన కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలోని 1,600 అంగన్వాడీ కేంద్రాలను ప్రతి రోజూ తెరవాలని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందించాలని తెలిపారు. చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పిల్లల్లో ఎత్తు, బరువు పెరుగుదలకు, రక్తహీనత లేకుండా బలవర్ధకమైన పౌష్టికాహారం అందించాలన్నారు. రక్తహీనత ఉన్న మహిళలు, బాలికలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి సూపర్‌వైజర్ ఇంటింటికీ వెళ్లి బలహీనంగా ఉన్న పిల్లలను గుర్తించి బలవర్ధకమైన ఆహారం అందించేలా తల్లులకు అవగాహన కలిపించాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో అతి తీవ్ర లోప పోషణ, తీవ్ర లోప పోషణ లేకుండా చేయాలని సంబంధిత సీడీపీవోలు, సూపర్‌వైజర్లను కలెక్టర్ శశాంక ఆదేశించారు. బలహీనంగా, ఎదుగుదల, బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారంతోపాటు, అంగన్వాడీలలో బాలామృతాన్ని కచ్చితంగా అందించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా సంక్షేమాధికారి పద్మజ రమణ, సీడీపీఓలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- భూ ఆరోగ్యకార్డుల జారీకి సన్నాహాలు
- ఆగస్టులో జారీ చేసే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 10వేల సాయిల్ టెస్టుల లక్ష్యం
- వానాకాలం 25శాతం నమూనాలే సేకరణ

ఎట్టకేలకు రైతులకు శుభవార్త అందింది. వ్యవసాయ భూముల్లో భూసార పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పరీక్షల్లో వచ్చిన వివరాలతో రైతులకు భూ ఆరోగ్య కార్డులు కూడా అందించేందుకు సర్కారు సన్నాహాలు చేస్తోంది. అయితే, ఇప్పటికే వర్షాలు ప్రారంభం కావడం, చాలామంది రైతులు విత్తనాలు వేసుకోవడంతో మట్టి నమూనాలను ఈ వానాకాలంలో తక్కువ సేకరించనున్నారు. ప్రతీ అయిదెకరాలకు ఒక మట్టి నమూనా తీసుకుని పరీక్షలు నిర్వహిస్తారు. వీటిని సంబంధిత ల్యాబ్‌కు పంపించి ఫలితాలను సాయిల్ హెల్త్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. వీటి ఆధారంగా రైతులకు భూ ఆరోగ్య కార్డులు జారీ చేస్తారు.



ఎట్టకేలకు భూసార పరీక్షలు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

భూసార పరీక్షలపై ఎట్టకేలకు సర్కార్ నిర్ణయం తీసుకుంది. కేంద్రం గతంలో ప్రకటించిన విధంగా భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు భూఆరోగ్య కార్డులను అందించే ప్రక్రియను మొదలు పెట్టింది. ప్రతీ ఏటా వానాకాలం ఆరంభానికి ముందే భూసార పరీక్షలు నిర్వహించి వీటి ఆధారంగా వ్యవసాయాధికారులు రైతులకు ఎరువులు సిఫారసు చేస్తుంటారనే విషయం తెలిసిందే. అయితే, ఈ ఏడాది వర్షాలు ఆరంభమైనా భూసార పరీక్షలపై సర్కార్ నుంచి ఎలాంటి ఆదేశాలూ రాకపోవడంతో అధికారులు కూడా దీనిపై ముందుకు వెళ్లలేదు. మరో వైపు అనేకమంది రైతులు భూసార పరీక్షల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం భూసార పరీక్షలపై ఆలస్యంగానైనా నిర్ణయం తీసుకుంది. తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా భూసార పరీక్షలు నిర్వహించి వీటి ఫలితాలను రైతులకు అందచేసేందుకు కార్యాచరణ మొదలు పెట్టింది. దీంతో వ్యవసాయ విస్తరణ అధికారులు ఉమ్మడి జిల్లాలో భూసార పరీక్షల ప్రక్రియ మొదలు పెట్టారు. ఇప్పటికే 2024-25 సంవత్సరానికి మట్టి నమూనాలు సేకరించే విధానం, ఫలితాల వెల్లడికి సంబంధించి వ్యవసాయాధికారులకు శిక్షణ ఇచ్చింది. అలాగే భూసార పరీక్షలకు సంబంధించి భూఆరోగ్య కార్డులను రైతులకు అందించి వారికి అవగాహన కల్పించింది. శిక్షణ తీసుకున్న అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. వ్యవసాయ పనులు ఆరంభం కావడంతో వానాకాలం సీజన్‌లో భూసార పరీక్షల లక్ష్యాలను తగ్గించి రబీలో పెంచారు. ఇప్పటికే వర్షాలు మొదలు కావడంతో రైతులు మెట్ట ప్రాంతాల్లో వివిధ పంటలు వేస్తున్నారు. దీంతో లక్ష్యాలను తగ్గించి తొలి విడత 25శాతం భూసార పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భూసార పరీక్షల నిర్వహణ ప్రక్రియ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 10,398 మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఏడాది భూసార పరీక్షలకు సమయం ఎక్కువ లేనందున వానాకాలంలో తక్కువ శాంపిల్స్ తీసుకుని రబీలో ఎక్కువ సేకరించే విధంగా ప్రణాళిక రూపొందించింది. ప్రతి జిల్లాకు ఒక మండలాన్ని ఎంపిక చేసి ఆ మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో మొత్తం నమూనాలను సేకరించాలని నిర్దేశించింది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈ వానాకాలం 25శాతం భూసార పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. రబీలో 75శాతం శాంపిల్స్ సేకరించనున్నారు. ప్రతి అయిదెకరాలకు ఒక మట్టి నమూనా తీసుకుని పరీక్షలు నిర్వహిస్తారు. వీటిని సంబంధిత ల్యాబ్‌కు పంపించి వీటి ఫలితాలను సాయిల్ హెల్త్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. వీటి ఆధారంగా రైతులకు భూఆరోగ్య కార్డులు జారీ చేస్తారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 10,398 భూసార పరీక్షలు నిర్వహిస్తుండగా రంగారెడ్డి జిల్లాలో ఈ ఏడాది 3,720 భూసార పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో 930 మట్టి నమూనాలు ఈ వానాకాలంలో తీసుకుని పరీక్షలు నిర్వహిస్తున్నారు. నందిగామ మండలం చేగూరు, మామిడిపల్లి, ఏదులపల్లి, నందిగామ, వీర్లపల్లిలో భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు. మిగతా 2,790 మట్టి నమూనాలను యాసంగి సీజన్‌లో సేకరిస్తారు. నమూనాల సేకరణ తీసే విధానంపై ఇప్పటికే ఏఈవోలకు శిక్షణ ఇచ్చారు.

వికారాబాద్ జిల్లాలో...

వికారాబాద్ జిల్లాలో ఈ ఏడాది 3,978 భూసార పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇందులో భాగంగా ఈ వానాకాలంలో 995 మట్టి నమూనాలు తీసుకోవాలని లక్ష్యం కేటాయించగా, ఆ నమూనాలన్నీ కోట్‌పల్లి మండల పరిధిలో తీసుకోనున్నారు. వచ్చే యాసంగిలో మిగతా మండలాల్లో 2,983 మట్టి నమూనాలు సేకరించనున్నారు.

మేడ్చల్ జిల్లాలో...

మేడ్చల్ జిల్లాలో ఈ ఏడాది 2,700 భూసార పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో భాగంగా ఈ వానాకాలంలో 675 మట్టి నమూనాలు తీసుకోవాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. మిగతావి వచ్చే యాసంగిలో చేపడతారు. కీసర మండలం యాద్గర్‌పల్లి(ఈస్ట్,వెస్ట్), గోధుమకుంటలో మట్టి నమూనాలు సేకరిస్తున్నారు.

అంతా యాప్ ద్వారానే...

భూసార పరీక్షలకు సంబంధించి మట్టి నమూనాల సేకరణ, ఫలితాల వెల్లడి ఈసారి కొత్త విధానంలో చేపడుతున్నారు. శిక్షణ పొందిన వ్యవసాయాధికారులు మట్టి తీయాల్సిన పొలం వద్దకు వెళ్లి నిలబడి ఫొటో తీయాలి. దీన్ని సాయిల్ హెల్త్ కార్డు పోర్టల్ యాప్‌నులో అప్‌లోడ్ చేయాలి. అంతేకాక నమూనాలు తీసిన ప్రదేశం రేఖాంశాలు, అక్షాంశాలతో పాటు పొలానికి సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేయాలి. ఆ తరువాత రైతు వివరాలతో పాటు మట్టి నమూనాలను ప్రయోగశాలకు పంపిస్తారు. ఎంపిక చేసిన గ్రామంలో ప్రతీ అయిదెకరాలకు ఒక శాంపిల్ తీయాలి. ఈ ప్రక్రియను జూలై 10వరకు పూర్తి చేయాలి. ఏదైనా ఇతర సమస్యలు ఎదురైతే జూలై నెలాఖరు వరకు తుది గడువు విధించారు. అనంతరం ఈ ఫలితాలను సాయిల్ హెల్త్ కార్డు పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి ఆగస్టు 20 నాటికి రైతులందరికీ భూఆరోగ్య కార్డులు ముద్రించి రైతు వేదికల్లో పంపిణీ చేయాలి. ఆ సమయంలో వ్యవసాయాధికారులు రైతులతో సమావేశమై పొలంలో ఏ పోషకాలు తక్కువ, ఎక్కువ ఉన్నాయో వివరించి వారికి తగిన సూచనలు, సలహాలు అందజేయాలి. ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాలి.

- ఎనిమిదేళ్లుగా సొంత భవనానికి నోచుకోని మండల పరిషత్ కార్యాలయం
- నిధుల లేమితో నిలిచిన భవన నిర్మాణం
- ఇబ్బందుల్లో ప్రజలు.. పట్టని ప్రజాప్రతినిధులు



అసంపూర్తిగా నిలిచిపోయిన మండల పరిషత్ కార్యాలయ భవనం

అసంపూర్తిగా నూతన బిల్డింగ్
సౌకర్యాలు లేని అద్దె భవనం

కడ్తాల్, జూన్ 25 : మండలానికి ప్రధాన పరిపాలనా కేంద్రమైన మండల పరిషత్ కార్యాలయం ఏళ్ల కాలంగా అసౌకర్యాల అద్దె భవనంలో కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం 2016 అక్టోబరు 11న పాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు, మండలాల ఏర్పాటులో భాగంగా కడ్తాల ను మండల కేంద్రంగా ఏర్పాటు చేసింది. కాగా, మండల పరిషత్ కార్యాలయానికి 8 ఏళ్లు పూర్తయినా నేటికీ సొంత భవనం లేదు. దాంతో ఏళ్లకాలంగా జాతీయ రహదారి పక్కన ఓ ప్రైవేట్ భవనంలో కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. కార్యాలయాలనికి అనుగుణంగా లేని భవనంతో అధికారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనంలో సమావేశాల నిర్వాహణకు అనువైన హాల్ లేక రేకుల షెడ్డులో మండల పరిషత్ సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న కడ్తాలలో మండల పరిషత్‌కు సొంత భవనం నిర్మించాలని గత ఐదేళ్లకాలంగా ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. దాంతో మండల కేంద్రం సమీపంలోని రైతువేదిక వద్ద గల వెంచర్‌లో గ్రామ పంచాయతీ పదిశాతం భూమిలో మండల పరిషత్ సొంత భవనం నిర్మాణానికి స్థలం కేటాయించారు.



అసౌకర్యాల అద్దె భవనంలో కొనసాగుతున్న మండల పరిషత్ కార్యాలయం

ఎస్‌డీఎఫ్ కింద రూ.50 లక్షలు మంజూరు

కడ్తాల మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణానికి స్పెషల్ డెవలప్‌మెంట్ నిధుల నుంచి రూ.50 లక్షలు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. దాంతో 2023 సెప్టెంబర్ 8న భవన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ నిధులున్నంత వరకు పనులు చేపట్టాడు. ప్రస్తుతం గ్రౌండ్‌ఫ్లోర్ స్లాబ్ నిర్మాణంతో పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత అదనపు నిధులు మంజూరు కాకపోవడం, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోకపోవడం, ఎన్నికలు రావడంతో భవన నిర్మాణం అసంపూర్తిగానే మిగిలిపోయింది.

రూ.కోటి నిధులు అవసరం

మండల పరిషత్ కార్యాలయ అసంపూర్తి పనులకు మరో కోటి రుపాయలు అవసరముందని అధికారులు పేర్కొంటున్నారు. జీప్లస్ వన్ భవన నిర్మాణానికి ప్రతిపాదించారు. దీనికి తోడు చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అదనపు నిధుల మంజూరుపై ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అసంపూర్తి పనులు పూర్తి చేస్తాం



అసంపూర్తి పనులు రెండు నెలల్లో పూర్తిచేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకువస్తాం. మండల పరిషత్ కార్యాలయానికి అదనపు నిధుల మంజూరుపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకుపోయాం. రూ.కోటి అదనపు నిధుల మంజూరుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అధికారులు, ప్రజలకు సౌలభ్యంగా భవన నిర్మాణం చేపడుతాం.

- కమ్లీమోత్యానాయక్, ఎంపీపీ, కడ్తాల్

అసంపూర్తి పనులు పూర్తి చేయాలి



మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ అసంపూర్తి పనులు పూర్తి చేయాలి. అవసరమైన నిధులు ప్రభుత్వం కేటాయించాలి. నిధుల మంజూరు విషయంలో స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతస్థాయి అధికారులు చొరవ తీసుకోవాలి. కార్యాలయానికి సొంత భవనం లేక ఇబ్బందులు కలుగుతున్నాయి. అద్దె భవనంలో సరైన వసతులు లేవు.

- బొప్పిడి గోపాల్, ఎంపీటీసీ, రావిచెడ్

ప్రతిపాదనలు పంపాం



మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ అసంపూర్తి పనుల పూర్తికి అవసరమైన నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదించాం. గతంలో భవన నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించారు. స్లాబ్ నిర్మాణం వరకు గ్రౌండ్‌ఫ్లోర్ పూర్తయ్యింది. నిధులు లేకపోవడంతో పనులు నిలిచిపోయాయి. మరో కోటి రూపాయలు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం.

- దార్ల పరమేశ్, ఏఈ, కడ్తాల్

ఆదమరిచారో.. ప్రాణాలకే ముప్పు!



చౌదర్‌పల్లిలో మ్యాన్‌హోల్ ఇలా..

యాచారం, జూన్ 25 : మండలంలోని చౌదర్‌పల్లి బీసీ బస్తీలో భూగర్భ డ్రైనేజీ ధ్వంసమై రెండేళ్లవుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. మరమ్మతులు చేయాలని పంచాయతీ అధికారులకు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలోని కావలి సత్తయ్య ఇంటి వెనకాల మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. అలాగే చౌదర్‌పల్లి నుంచి చిన్నతూండ్ల వెళ్లే దారిలో రోడ్డుపక్కనే రెండున్నరేళ్లుగా మరమ్మతుకు నోచుకోని భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌తో స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ వాహనాలు మ్యాన్‌హోల్‌పై నుంచి వెళితే తీవ్రగాయాలతో పాటు ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వేంకటేశ్వర స్వామివారి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వర స్వామి కల్యాణం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 25: షాద్‌నగర్ పట్టణానికి ముఖద్వారంగా ఉన్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రవణా నక్షత్రాన్ని పురష్కరించుకుని మంగళవారం భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాసచార్యుల బృందం స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేతుడైన స్వామి ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అన్నదానం చేశారు.



మొలకలకు నీటిని స్ప్రే చేస్తున్న రైతు రాజు

మొక్కవోని దీక్షతో..

- ముఖం చాటేసిన వరుణుడు
- చేనును కాపాడుకునేందుకు నీటిని స్ప్రే చేస్తున్న వైనం

వారం క్రితం వరకు అడపాదడపా వర్షాలు కురువగా రైతులు విత్తనాలు విత్తారు. ఒక్క సారిగా వర్షాలు ముఖం చాటేశాయి. మొలకలెండుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నీరు లేక వాడుతుండడంతో రైతుల గుండె తరుక్కుపోతోంది. దీంతో వారు మొలకలకు ప్రాణంపోసే పనులు చేపడుతున్నారు. వికారాబాద్ మండలం నారాయపూర్‌లో రాజు అనే రైతు మంగళవారం ఎండుతున్న పత్తి మొలకలకు స్ప్రేయర్‌తో నీటిని పిచికారి చేశాడు. రేపో ఎల్లుండో వానొచ్చినా అప్పటి వరకు మొలకలు బతకాలనే నీటిని స్ప్రే చేస్తున్నట్టు రైతు తెలిపాడు. పోయినసారి కంటే ఈ సారి మరింత కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయని రైతు వాపోయాడు. తగినన్ని వర్షాలు కురవక విత్తనాలు కూడా సరిగా మొలకెత్తలేదని అతడు తెలిపాడు.

వికారాబాద్, జూన్ 25

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి



శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

కొడంగల్, జూన్ 25: పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి సారిగా కొడంగల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడి పరిస్థితులు, శాంతి భద్రతల పరిరక్షణ తదితర అంశాలపై సీఐ, ఎస్‌ఐలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా డీఎస్పీ కరుణాసాగర్ రెడ్డి, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై భరత్‌రెడ్డి పోలీసు సిబ్బందితో నిర్వహించిన గౌరవ వందనాన్ని ఎస్పీ స్వీకరించారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్ కావడంతో ఎస్పీ ఆకస్మిక సందర్శనతో శాంతిభద్రతలపై ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలోగల శిథిలావస్థలో ఉన్న పోలీసు క్వార్టర్స్‌ను పరిశీలించి వివరాలను సేకరించారు. శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్‌ను తొలగించి నూతన క్వార్టర్స్ నిర్మాణానికి అవకాశం ఉందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఉన్నారు.

పరిగి: పరిగి పోలీస్‌స్టేషన్‌ను వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి మంగళవారం సందర్శించారు. జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ మొదటిసారిగా పరిగి పీఎస్‌కు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సిబ్బంది గౌరవ వందనాన్ని ఎస్పీ స్వీకరించారు. డీఎస్పీ, సీఐలతో మాట్లాడి ఇక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు లేకుండా చూడాలని సూచించారు. మరోసారి పరిగికి వస్తానని సిబ్బందికి తెలిపారు. ఫిర్యాదు దారులు, ప్రజలపట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ సంతోష్ సిబ్బంది ఉన్నారు.

జూనియర్ కళాశాలకు స్థల పరిశీలన



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

బొంరాస్‌పేట్, జూన్ 25: వికారాబాద్ జిల్లా నోడల్ అధికారి శంకర్ నాయక్ మంగళవారం బొంరాస్‌పేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కళాశాలకు తరగతి గదుల గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు వారు తరగతి గదులను కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం దగ్గర కళాశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే కళాశాలలో తరగతులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధిహామీలో రూ.70వేల అవినీతి



సామాజిక తనిఖీ బహిరంగ సభలో పాల్గొన్న అధికారులు

బొంరాస్‌పేట్, జూన్ 25: ఉపాధిహామీ పథకం పనుల్లో రూ.70వేలు అవినీతి జరిగినట్లు ఉపాధిహామీ సిబ్బందికి అధికారులు జరిమానా విధించారు. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా జరిమానా విధించినట్లు ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని 46 గ్రామ పంచాయతీల్లో జరిగిన రూ.6.94కోట్ల పనులకు వారం రోజుల పాటు సామాజిక తనిఖీ సిబ్బంది నివేదికలు సమర్పించడంతో మండల స్థాయిలో జరిగిన బహిరంగ సభలో అధికారులు రూ.70వేలు అవినీతి జరిగినట్లు వెల్లడించడం గమన్హారం. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ అధికారులు రవి, సరళ, భార్గవి, సిబ్బంది గంగరాజు, స్వామి పాల్గొన్నారు.

పరిగిలో గుట్కా పట్టివేత



పట్టుబడిన గుట్కాలతో ఎస్ఐ, సిబ్బంది

పరిగి, జూన్ 25: పరిగిలో నిషేధిత గుట్కా పట్టుబడింది. పట్టణంలోని గాంధీచౌక్‌లోని బాలాజీ కిరాణషాపులో సోమవారం రాత్రి తనిఖీ చేయగా గుట్కాలు లభించాయి, గుట్కాల విలువ రూ.10వేలు ఉంటుందని ఎస్ఐ సంతోష్ తెలిపారు. గుట్కాలను స్వాధీనం చేసుకుని షాపు యజమాని కిషోర్‌కుమార్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కులకచర్ల ప్రభుత్వాసుపత్రి తనిఖీ



మాట్లాడుతున్న జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి సాయిబాబా

కులకచర్ల, జూన్ 25: కులకచర్ల ప్రభుత్వాసుపత్రిని మంగళవారం జిల్లా మాత శిశు సంరక్షణ అధికారి సాయిబాబా ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడారు. సరైన వైద్యం అందుతుందా? లేదా? అని అడిగారు. రోజుకు ఎంతమంది వైద్యులు విధుల్లో ఉంటున్నారని వైద్యురాలు మాధురితో అడిగి తెలుసుకున్నారు. ప్రతీనెల ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయి? మందులు ఉన్నాయా? అని ఆరాతీశారు. ఆస్పత్రిలోని అన్ని గదులను పరిశీలించారు. ముఖ్యంగా గర్భిణులు మూడు నెలల్లోపే వారి ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఐరన్ కాల్షియం మాత్రలు తీసుకోవాలన్నారు. మూడు నెలల్లో మొదటి డోస్, 5 నెలల్లోపు రెండవ ఇంజక్షన్ తీసుకోవాలన్నారు. రక్తం తక్కువగా ఉన్న వారికి ఆసుపత్రిలో ఐరన్ సుక్రోజ్ ఎక్కించుకోవాలన్నారు. క్రమం తప్పకుండా గర్భిణులు అన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వాజీహుద్దీన్, సీహెచ్‌వో చంద్రప్రకాశ్, ఆరోగ్య సిబ్బంది సుజాత పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఏటికాల్వ గండి పూడ్చివేత



ఏటి కాల్వ గండి పూడ్చివేతను పరిశీలిస్తున్న గ్రామస్థులు

బొంరాస్‌పేట్, జూన్ 25: గత వర్షాకాలంలో ఏటికాల్వకు పడిన గండిని బొంరాస్‌పేట్ గ్రామ పెద్దలు, రైతులు ఎట్టకేలకు పూడ్చివేశారు. బొంరాస్‌పేట్ పెద్ద చెరువుకు ప్రధాన ఆయువు అయిన ఏటికాల్వకు గండిపడటంతో వచ్చే వరద నీరంతా వాగులోకి వెళ్లే అవకాశం ఉంది. గ్రామ రైతుల కోరిక మేరకు ఇరిగేషన్ అధికారుల సూచనతో గ్రామ పెద్దలు వీరేశం, నీరటి గోపాల్ తదితరులు జేసీబీలతో ఏటి కాల్వకు పడిన గండిని పూడ్చివేశారు. రెండు జేసీబీలు, ట్రాక్టర్ల ద్వారా రెండు రోజుల పాటు ఈ గండి పూడ్చివేతను చేపట్టారు. దీంతో వరద నీరు బొంరాస్‌పేట్ పెద్ద చెరువులోకి చేరడంతో రైతుల పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తంచేశారు.

ఏసీఈ కళాశాలలో నాసా యాప్ ఛాలెంజ్ హ్యాకథాన్



ఏసీఈ కళాశాలలో హ్యాకథాన్ ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ బీఎల్ రాజు

ఘట్‌కేసర్ రూరల్ జూన్ 25: అంకుషాపూర్ ఏసీఈ కళాశాలలో ఫౌండర్ ల్యాబ్, ఎస్‌యూఎంపీఎన్ సౌజన్యంతో సోమవారం 24గంటల నాసా యాప్ ఛాలెంజ్-2024 హ్యాకథాన్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎల్ రాజు, ఎస్‌యూఎంపీఎన్ ఫౌండర్ సాయికిరణ్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి హ్యాకథాన్ ప్రారంభించారు. హ్యాకథాన్‌లో విద్యార్థులు స్పేస్ టెక్నాలజీకి సంబంధించిన యాప్‌లను అభివృద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దుర్గప్రసాద్, శ్రవణ్, శ్రీలత, హెచ్‌వోడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ' చిన్నారులకు ఉచితంగా యూనిఫాం



- ఈ విద్యా సంవత్సరం నుంచే అందించాలని ప్రభుత్వ నిర్ణయం
- జులై నుంచి పంపిణీ చేసే అవకాశం!

చేవెళ్ల, జూన్ 25 : అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకుగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం వినూత్నంగా ఆయా పథకాలను ముందుకు తీసుకొస్తున్నాయి. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ విద్యాసంవత్సరం నుంచి అంగన్‌వాడీ పిల్లలకు ఉచితంగా యూనిఫాం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలలో చదుతున్న విద్యార్థులకు మాత్రమే ఉచితంగా పాఠ్యపుస్తకాలతో పాటు యూనిఫాం పంపిణీ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సైతం ఉచితంగా యూనిఫాం అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చేవెళ్ల డివిజన్ పరిధిలో 255 అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం 14,379 మంది పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. అయితే, తల్లిదండ్రులు నాలుగేళ్ల నుంచే నర్సరీ అంటూ ప్రైవేట్ పాఠశాలకు పిల్లలను పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ స్కూళ్లగా మార్చే క్రమంలో మొదటగా 3 నుంచి 6 సంవత్సరాల లోపు చిన్నారులకు ఈ విద్యాసంవత్సరం నుంచి యూనిఫాం అందించాలని నిర్ణయించారు. ఈమేరకు జిల్లా ఐసీడీఎస్ అధికారులకు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దాంతో అంగన్‌వాడీ కేంద్రాల వారీగా పిల్లల వివరాలను అధికారులు సేకరించారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు చేవెళ్ల ఐసీడీఎస్ డివిజన్‌లో 3 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలు మొత్తం 14,379 మంది ఉన్నారు. చేవెళ్ల మండలంలో 66 కేంద్రాలు ఉండగా.. 3 నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలు 3,647 మంది ఉన్నారు. అదేవిధంగా షాబాద్ మండలంలో 69 కేంద్రాల్లో 3,005 మంది, శంకర్‌పల్లి మండలంలో 63 కేంద్రాలకు గాను 3,947 మంది పిల్లలు ఉన్నారు. మొయినాబాద్ మండలంలో 57 కేంద్రాల్లో మొత్తం 3,780 మంది పిల్లలు ఉన్నట్లు అధికారులు లెక్కలు తేల్చి నివేదికలు సమర్పించారు.

యూనిఫాం తయారీ మహిళా సంఘాలకు..

అంగన్‌వాడీ చిన్నారులకు అందించే యూనిఫాం.. మగపిల్లలకు షర్ట్, నెక్కర్, ఆడపిల్లలకు ఫ్రాగ్ అందించాలని నిశ్చయించి డిజైన్‌ను ఎంపిక చేశారు. డ్రెస్సులను కుట్టించాలని స్త్రీశిశు సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ అధికారులకు క్లాత్‌ను అప్పగించింది. ఈ శాఖ పరిధిలో ఉన్న మహిళాశక్తి సంఘాలు ఆయా డిజైన్లలో డ్రెస్సులను కుట్టి ఇవ్వనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు యూనిఫాం కుడుతున్నందున.. వారికే అప్పగిస్తే మహిళా శక్తి సంఘాల సభ్యులకు ఆర్థికంగా భరోసా ఇచ్చినట్లు ఉంటుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి జులై నెలాఖరు వరకు పంపిణీ చేయాలని యోచిస్తున్నారు.



ఈ విద్యాసంవత్సరం నుంచే పంపిణీ చేస్తాం

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకుగాను ఈ విద్యాసంవత్సరం నుంచే పిల్లలకు ఉచితంగా యూనిఫాం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులతోపాటు సంబంధించిన యూనిఫాం మెటీరియల్‌ను డీఆర్‌డీఏ శాఖ అధికారులకు అప్పగించారు. వచ్చేనెల వరకు యూనిఫాం కుట్టించి పంపిణీ చేసే అవకాశం ఉంది.

- శోభరాణి, సీడీపీవో, చేవెళ్ల



పూజలో పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తదితరులు

దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం

ఆమనగల్లు, జూన్ 25: మానవాళి సన్మార్గ పురోగమనానికి, సమాజ శాంతి స్థాపనకు దైవ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగే వారు ఆనందమయ జీవితాన్ని పొందుతారని అన్నారు. పోల్కమ్మర్ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయాన్ని మంగళవారం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సందర్శించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామాంజనేయ స్వామి దేవాలయ పెయింటింగ్ పనుల నిమిత్తం ఐక్యత ఫౌండేషన్ ద్వారా ఆలయ నిర్వాహకులకు రూ.2.60 లక్షలు విరాళం అందజేశారు. సుంకిరెడ్డిని నిర్వాహకులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ ద్వారా చేయూతనందిస్తున్నట్లు చెప్పారు. సేవా కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామచందర్ రెడ్డి, భగవాన్, హన్మంత్, జంగిరెడ్డి, రాంరెడ్డి, ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, శ్రీనివాస్ రెడ్డి, అభినవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న దళిత సంఘం నాయకులు

మధుసూదన్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలి

షాబాద్, జూన్ 25 : దళిత విద్యార్థిపై దాడి చేసిన మధుసూదన్ రెడ్డిని కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు షాబాద్‌లో కంది-షాద్‌నగర్ రహదారిపై మంగళవారం ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి సంఘాల నాయకులతో మాట్లాడి నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ మండల పరిధిలోని కేసారం గ్రామానికి చెందిన బేగరి యాదగిరిపై మధుసూదన్‌రెడ్డి దాడి చేయడం సరికాదన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మధుసూదన్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ, సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి దేవేందర్, ఆల్ ఇండియా యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు ఆంజనేయులు, విశ్వం, శ్రీశైలం, మహేష్, శ్రీనివాస్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

చనిపోయినా.. మరొకరికి కంటిచూపు

- నేత్రదానంతో ఆదర్శంగా నిలిచిన వృద్ధురాలు

షాబాద్, జూన్ 25 : ఓ వృద్ధురాలు తాను చనిపోయినా మరొకరికి కంటి చూపునిచ్చి ఇతరులకు ఆదర్శంగా నిలిచింది. మండల పరిధిలోని ఎర్రోనిగూడ గ్రామానికి చెందిన సామ రుక్కమ్మ (90) సోమవారం మృతి చెందింది. అయితే, ఆమె అంతకుముందు.. తన మరణానంతరం కళ్లను దానం చేయడానికి ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి హామీ పత్రం ఇచ్చారు. ఈమేరకు ఆమె మరణవార్త తెలుసుకున్న ఆసుపత్రి సిబ్బంది నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా రుక్కమ్మ సామాజిక స్పృహను పలువురు కొనియాడారు. ప్రతీఒక్కరు మరణాంతరం కళ్లను దానం చేయాలని రుక్కమ్మ కుమారుడు సామ మాధవరెడ్డి, మనవడు మహేందర్‌రెడ్డి కోరారు.



రుక్కమ్మ (ఫైల్)



సదస్సులో ప్రసంగిస్తున్న న్యాయాధికారి అశోక్

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తాండూరు, జూన్ 25: చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నామాల అశోక్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జ్ఞానవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి చంద్రశేఖర్, ఎస్ఐ కాశీనాథ్, కళాశాల ప్రిన్సిపల్ మల్లినాథప్ప పాల్గొన్నారు.

నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి

తాండూరు, జూన్ 25: ఎన్‌టీఏను రద్దు చేసి నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తాండూరు పట్టణం అంబేద్కర్ చౌక్‌లో మంగళవారం ఆయన నిరసన వ్యక్తం చేశారు. యూజీసీ నీట్ రద్దుకు బాధ్యత వహించి రీ ఎగ్జామ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లీక్‌తో కేంద్రం పరువు తీసుకుందన్నారు. నీట్ రద్దుకు బాధ్యత వహించి అభ్యర్థుల నుంచి వసూలు చేసిన అప్లికేషన్ ఫీజును రీఫండ్ చేసి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



తాండూరు అంబేద్కర్ చౌక్ వద్ద పీడీఎస్‌యూ నిరసన

మెటల్ రోడ్డును బీటీగా మార్చాలి

యాలాల, జూన్ 25: మండలంలోని దేవనూర్ నుంచి దుబ్బ తండా వరకు ఉన్న మెటల్‌రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని దుబ్బ తండావాసులు కోరారు. దేవనూరు నుంచి దుబ్బతండా వరకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న మెటల్ రోడ్డు వర్షాకాలంలో గుంతలుపడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రోజూ దెబ్బతండా నుంచి దేవనూర్, తాండూరు, ఇతర ప్రాంతాలకు విద్యార్థులు, గ్రామస్థులు వెళ్లి వస్తుంటారని చెప్పారు. వర్షాకాలంలో ఈ రోడ్డు పూర్తిగా పాడై రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని తండావాసులు కోరుతున్నారు.



దుబ్బ తండాకు వెళ్లే మెటల్ రోడ్డు

యంత్రాలపై అందని రాయితీ

- రైతులకు భారంగా మారిన వ్యవసాయం

కొడంగల్ రూరల్, జూన్ 25: ఆరుగాలం ఎండకు, వానకు ఓర్చి చెమటను చిందించి పంటను సాగుచేస్తున్నారు రైతులు. వారికి ప్రకృతి సహకరిస్తేనే పెట్టిన పెట్టుబడి చేతికొస్తుంది. సాగుకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో గతంలో ప్రభుత్వాలు అనేక యంత్రాల పరికరాలపై రాయితీ అందించేది. అదికాస్త మున్నాళ్ల ముచ్చటే అయింది. కొన్నేళ్లుగా ప్రభుత్వం సబ్సిడీపై ఎలాంటి యంత్రాలు, పరికరాలు అందించడం లేదు. దీనికి తోడు రోజురోజుకు సాగుఖర్చులు పెరిగి వ్యవసాయం భారంగా మారింది.



ఏళ్లుగా ఇదే పరిస్థితి

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడూ యంత్ర లక్ష్మి పథకంతో యంత్రాలపై 50శాతం రాయితీ ఇచ్చేది. రోటోవేటర్‌పై 50శాతం సబ్సిడీ, 33శాతంపై పిచికారి పరికరాలను రైతులకు అందించేది. కూరగాయ విత్తనాలు, ట్రాక్టర్లు, స్ప్రే పంపులు, కలుపుతీసే యంత్రాలు వరికోత మిషన్లు, టార్పాలిన్లు సబ్సిడీపై అందించేవారు. అయితే 2018 తరువాత ఈ పథకం అటకెక్కింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుబంధు పథకం అమలు చేయడంతో యంత్రాల సబ్సిడీ పథకాన్ని ఎత్తివేశారు. దీంతో రైతులు యంత్రాల కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో కూలీలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

యంత్ర పరికరాలతో మేలు

వ్యవసాయం పనుల్లో యంత్రాలు వినియోగించడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగుకు ఆవకాశం ఉంటుంది. విత్తనాలు వేయడం, పంటకోత వరకు అన్నిపనులు యంత్రాలతో చేయడం ద్వారా సమయం, కూలీల కొరత తీరడంతో పాటు ఖర్చులు తగ్గుతాయి. వరికోత సమయంలో కూలీలు దొరకక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కోత యంత్రాలు కొనుగోలు చేయడం రైతులకు భారంగా మారుతోంది. దీంతో అద్దెకు తీసుకుని పనులు పూర్తి చేసుకుంటున్నారు. వరికోత యంత్రాలను సబ్సిడీపై అందిస్తే ఇబ్బందులు దూరమవుతాయని రైతులు అంటున్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించాలి

ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందించాలి. రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి సాగు ఖర్చులు ఆదా అవుతాయి. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించి పరికరాలను సన్న, చిన్నకారు రైతులకు రాయితీపై అందించాలి.



డి.వెంకటయ్య, రైతు, టెకులకోడ్

బాలిక ప్రేమించలేదని ఆర్మీ జవాన్ ఆత్మహత్య

బొంరాస్‌పేట్, జూన్ 25(ఆంధ్రజ్యోతి): ఓ బాలిక తన ప్రేమను అంగీకరించలేదని మనస్థాపానికి గురైన ఓ యువ ఆర్మీ జవాన్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా దోమ మండలం కొత్తపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తపల్లికి చెందిన కుంట మంగమ్మ-రాములు దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెద్ద కొడుకు చింటు(21) 2023లో అగ్నిపథ్ కింద ఆర్మీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. బెంగళూరులో శిక్షణ పూర్తిచేసుకొని ఈ నెల 22న గ్రామానికి వచ్చాడు. 24న సాయంత్రం దాదాపూర్ ఉన్నత పాఠశాల వదిలిన తర్వాత ఓ విద్యార్థిని తోటి విద్యార్థినులతో కలిసి ఇంటికి వెళ్తోంది. ఆ బాలికను చూసిన చింటు తన స్నేహితుడితో కలిసి బాలిక వద్దకు వచ్చి.. 'నేను నిన్ను ప్రేమిస్తున్నా. నా ప్రేమను ఒప్పుకో.' అని బలవంతం చేశాడు. ఈ విషయాన్ని బాలిక తన కుటుంబ సభ్యులకు తెలిపింది. వారు చింటు ఇంటికి వెళ్లి అతడిని మందలించారు. ఈ ఘటనతో మనస్థాపానికి గురైన చింటు సోమవారం రాత్రి తన పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. 'ఊరిలో మన పురువు పోయింది నాన్నా. ఐ మిస్ యూ.' అని కుటుంబ సభ్యులకు ఫోన్ మెసేజ్ పెట్టాడు. ఆందోళనతో కుటుంబ సభ్యులు అదే రాత్రి పొలం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే చింటు ఉరేసుకున్నాడు. తన కొడుకు మృతికి కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని చింటు తండ్రి రాములు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్‌కుమార్ తెలిపారు.



చింటు(ఫైల్)

'ధరణి' పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

- మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

కీసర రూరల్, జూన్ 25: ధరణి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం కీసరలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని(ఆర్డీవో) సందర్శించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అన్ని మాడ్యుల్స్‌లో దాఖలైన ధరణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా చొరవ చూపాలని సూచించారు. ఇప్పటి వరకు దాఖలైన దరఖాస్తులు, పరిష్కరించిన, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సక్సెషన్, పెండింగ్ మ్యుటేషన్, వంటి దరఖాస్తులను అవసరమైన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములను కబ్జాకు గురైతే క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న విజయేందర్‌రెడ్డి

అరకొర వసతులు.. విద్యార్థుల అవస్థలు

- బషీరాబాద్ సీపీఎస్ పాఠశాలలో తరగతి గదుల కొరత
- నిజాం కాలంనాటి పాత భవనంలో విద్యార్థుల చదువులు



గదుల కొరతతో నిజాం కాలంనాటి పురాతన భవనంలో కొనసాగుతున్న బషీరాబాద్ సీపీఎస్ పాఠశాల

బషీరాబాద్, జూన్ 24: మండల కేంద్రంలోని సీపీఎస్(కేంద్ర ప్రాథమిక పాఠశాల)లో అరకొర వసతుల మధ్య ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేస్తున్నారు. ఇక్కడి పాఠశాలలో 1 నుంచి 5 తరగతులకు గాను 72మంది విద్యార్థులు ఉండగా తరగతి గదులు సరిపోనులేకపోవడంతో నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. నలుగురు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ గదుల కొరత ఇక్కడా తీవ్రంగా ఉంది. నిజాం కాలంనాటి ఓ పురాతన భవనంలో విద్యార్థులను కూర్చోబెట్టి విద్యాబోధన కొనసాగిస్తున్నారు. ఈ గదిలోనే ఓ పక్కన మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలు వంటను వండటంపై వచ్చే పొగతో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఏళ్ల తరబడి వంటగది మరమ్మతుకు నోచుకోకపోవడంతో వృథాగా మారింది. వర్షాలు కురిస్తే పాత భవనం లీకేజీలతో ఒక్కోసారి విద్యార్థులు కూర్చోవడానికి వీలులేక ఇంటికి పంపించిన సందర్భాలు అనేకమున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అమ్మఆదర్శ పాఠశాల కింద మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైన పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. పాఠశాల ఆవరణలో కూలిన వంటగది, పక్కన పాడుబడిన భవనం కూల్చివేయడంతో పరిసర ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది. పాఠశాలకు ఓపక్క ప్రహరీ లేకపోవడంతో సమీపంలోని కాలనీ యువకులు కొందరు లోపలికి వచ్చి మద్యం సేవిస్తున్నారని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బషీరాబాద్ సీపీఎస్ పాఠశాలలో వంటగది నిరుపయోగంగా మారిన దృశ్యం



మతిస్థిమితం లేని మహిళతో చేవెళ్ల పోలీస్‌లు

మానవత్వం చాటుకున్న చేవెళ్ల పోలీసు

చేవెళ్ల, జూన్ 25 : మతిస్థిమితం సరిగాలేని ఓ మహిళ పట్ల చేవెళ్ల పోలీసులు మానవత్వం చాటుకున్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో పోలీస్‌లు పెట్రోల్ మొబైల్ వాహనంలో తిరుగుతుండగా మతిస్థితం సరిగాలేని ఓ మహిళ రోడ్డుపై కన్పించింది. దాంతో పోలీస్‌లు ఆ మహిళ వద్దకు వెళ్లి పలుకరించగా.. ఎలాంటి సమాధానం రాలేదు. ఒంటిపై చిరిగిపోయిన బట్టలు ఉండడం గమనించి.. వెంటనే కొత్తబట్టలు కొనుగోలు చేసి మహిళా కానిస్టేబుల్ మంజులతో ఆమెకు వేయించారు. ఈ విషయం స్థానికులకు తెలియడంతో పోలీసులను అభినందించారు. కానిస్టేబుళ్ల అశోక్, మంజుల, డ్రైవర్ జావిద్‌లపై ప్రశంసలు కురిపించారు.

ఆర్ఐపై జడ్చర్ల ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు

తాండూరు, జూన్ 25: బాలనగర్ గిర్ధావర్ వెంకటొరెడ్డిపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ ట్రెసా వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు భూసమస్యల పరిష్కారానికి సెలవు దినాల్లోనూ పనిచేస్తున్న తరుణంలో తహసీల్దార్ కార్యాలయానికి ఎమ్మెల్యే వచ్చి ఆవేశంతో దూషించడం సరికాదన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను రెవెన్యూ ఉద్యోగులంతా ఆందోళన చేస్తున్నారని అన్నారు.



విజయేందర్



సంధ్యకు అడ్మిషన్ అందజేస్తున్న గోపాల్ నాయక్

చదువుకు పేదరికం అడ్డుకాదు

ఆమనగల్లు, జూన్ 25: చదువుకు పేదరికం అడ్డుకాదని మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గోపాల్ నాయక్ అన్నారు. పేద విద్యార్థుల విద్యాభ్యున్నతికి ప్రతీ ఒక్కరు తమ వంతు చేయూతనందించి ప్రోత్సహించాలని కోరారు. మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామానికిచెందిన విద్యార్థిని తోడేటి సంధ్య తల్లి చనిపోవడంతో ఆమనగల్లు మండలం జంగారెడ్డిపల్లి గ్రామంలోని అమ్మమ్మ మండె ఈదమ్మ దగ్గర ఉండి చదువుకుంటోంది. సంధ్య చదువులు వృద్ధురాలైన అమ్మమ్మకు భారంగా మారడంతో ఉప్పల వెంకటేశ్‌ను ఆశ్రయించింది. దీంతో స్పందించిన వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సంధ్యకు చదువు చెప్పించడానికి ముందుకు వచ్చారు ఆమనగల్లు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మంగళవారం ట్రస్ట్ తరఫున గోపాల్ నాయక్ అడ్మిషన్ చేయించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వందల మంది పేద పిల్లలకు చదువుకు చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు తమ వంతు పాలు పంచుకోవాలని గోపాల్ నాయక్ సూచించారు. బుచ్చిబాబు, అశోక్, టిప్పుసుల్తాన్ తదితరులు ఉన్నారు.

ముఖం చాటేసిన వరుణుడు

- మొలకెత్తిన విత్తనాలు వాడుముఖం
- ఆందోళనలో అన్నదాతలు

వర్షాలు లేక రైతన్న ఆందోళన

తాండూరు రూరల్, జూన్ 25: తొలకరిలో వర్షాలు కురవడంతో రైతన్నలు సంబురపడ్డారు. ఎంతో సంతోషంతో విత్తనాలు విత్తుకున్నారు. తీరా విత్తనాలు మొలకెత్తే సమయంలో వర్షాలు ముఖం చాటేయడంతో మొలకెత్తిన విత్తనాలు వాడుముఖం పడుతున్నాయి. దీంతో రైతులు వానాకాలంపై ఆశలు వదులుకుంటున్నారు. తొలకరి వర్షాలతో తాండూరు మండలంలోని ఆయా గ్రామాల్లో 45,000ఎకరాల్లో పత్తి, 61వేల ఎకరాల్లో కంది, 7500 ఎకరాల్లో పెసర, 7వేల ఎకరాల్లో మినుము, 35వేల ఎకరాల్లో వరి, 2500ఎకరాల్లో సోయాబీన్ తదితర విత్తనాలు నాటారు. మొక్కలు నాటినప్పటి నుంచి వర్షాలు కురియకపోవడంతో కొన్నిమొక్కలు వాడిపోగా మరి కొన్ని విత్తనాలు మొలకెత్తకుండా భూమిలోనే కుళ్లిపోయాయి. మండలపరిధిలోని చెంగోల్, ఐనెల్లి, మిట్టబాస్పల్లి, గుంతబాస్పల్లి, అంతారం, కరన్‌కోట్, మల్కాపూర్, నారాయణపూర్ తదితర గ్రామాల్లో ఎర్ర, నల్ల రేగడి నేలల్లో కంది, పెసర, మినుము, పత్తి వంటి పంటలు వేశారు. కానీ వర్షాలు లేక మొలకెత్తలేదు. దీంతో రైతన్నలు విలవిల్లాడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే తమకు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నామని వారు కన్నీటిపర్యంతమవుతున్నారు.



నారాయణపూర్ గ్రామ శివారులో మొలకెత్తిన కంది మొక్కలు

ఆమనగల్లు ఎంపీవోగా ఉమారాణి



ఆమనగల్లు, జూన్ 25: ఆమనగల్లు మండల ఎంపీవోగా ఉమారాణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. యాచారం మండలం నుంచి ఆమె బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీవో శ్రీలత డిప్యుటేషన్ రద్దు చేయడంతో యాచారం వెళ్లారు. ఉమారాణి మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఉత్పన్నమైతే తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

పనితీరును బట్టే ప్రజల్లో కీర్తి

తలకొండపల్లి, జూన్ 25: పనితీరును బట్టే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో కీర్తి లభిస్తుందని తలకొండపల్లి ఎస్సై ఎ.శ్రీకాంత్ అన్నారు. తలకొండపల్లి పోలీసుస్టేషన్‌లో నాలుగేళ్లుగా హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి కడ్తాల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయిన తిరుపతికి మంగళవారం స్టేషన్ ఆవరణలో వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఆయన తలకొండపల్లి మండలంలో అందించిన సేవలను కొనియాడారు. పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిని సన్మానిస్తున్న ఎస్సై శ్రీకాంత్

జూనియర్ కళాశాలలో
సౌకర్యాల కల్పనకు కృషి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 25: షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కావల్సిన మౌలిక సౌకర్యాలను కల్పిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారు. ఈమేరకు మంగళవారం షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జూనియర్ కళాశాల సిబ్బంది ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల గదులు, టాయిలెట్లకు మరమ్మతులు చేయించాలని అన్నారు. భవనానికి రంగులు వేయించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే జూనియర్ కళాశాలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నానని, వేలాది మంది విద్యార్థులు చదివిన జూనియర్ కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని, అవసరమైతే దాతల సహకారం తీసుకొని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ప్రిన్సిపాల్ కుర్షియా బేగం, ఎంఏ రవూఫ్, సిబ్బంది తదితరులున్నారు.



ఎమ్మెల్యే శంకర్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న జూనియర్ కళాశాల సిబ్బంది

క్రైం కార్నర్

సాయిబాబా కాలనీలో
దొంగల హల్‌చల్

- భయాందోళనలో కాలనీ వాసులు
- పలు ఇళ్లలో చోరీకి యత్నం



ఇంటి తాళం పగులగొడుతున్న దొంగ

షాద్‌నగర్ రూరల్, జూన్ 25 : పట్టణంలోని సాయిబాబా కాలనీలో ఆదివారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. దాంతో కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. రెండు నెలల క్రితం కాలనీకి చెందిన శివరాం ఇంట్లో దొంగలు పడి నగదు, బంగారు, వెండి వస్తువులు అపహరించుకుపోయారు. దొంగతనం జరిగిన తర్వాత ప్రైవేటు కంపెనీలో పనిచేసే శివరాంనకు హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ కావడంతో కుటుంబ సభ్యులతో అక్కడికి మకాం మార్చాడు. అప్పటి నుంచి ఇంట్లో ఎవరూ ఉండటం లేదు. దాంతో ఆదివారం రాత్రి ఇద్దరు దొంగలు రాడ్లు పట్టుకుని కాలనీలోకి వచ్చి ముందుగా శివరాం ఇంట్లోకి గేటు తాళం పగులగొట్టి తర్వాత ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంట్లో ఎలాంటి వస్తువులు దొరక్కపోవడంతో.. కాలనీలోని పలు ఇళ్లలోకి కాంపౌండ్ దూకి చోరీకి యత్నించారు. అయితే, అన్ని ఇళ్లలో కూడా లోపలి నుంచి గడియలు పెట్టి ఉండటంతో వెనుదిరిగారు. దొంగలు పలు జిల్లాల్లో చోరీలు చేసి గతంలో జైలుకు వెళ్లినట్లు పోలీసులకు సమాచారం అందడంతో ఇద్దరిలో ఓ దొంగ ఫోన్‌కు కాల్ చేసి చూడగా.. షాద్‌నగర్ వచ్చిన తర్వాత స్విచ్‌ఆఫ్ చేసినట్లు సమాచారం. కాగా, తమ కాలనీలో పెట్రోలింగ్ పెంచాలని కాలనీ వాసులు పోలీసులను కోరుతున్నారు. కాగా, కాలనీలో ఏర్పాటు చేసిన సీసీటీవీ ఫుటేజీల్లో దొంగలకు సంబంధించిన సమాచారం మేరకు పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

- నగదు, నగలతో పాటు భూమి పాస్‌పుస్తకం అపహరణ

శంకర్‌పల్లి, జూన్ 25: గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు విరగ్గొట్టి నగదు, వెండి నగలు, భూమి పాస్‌పుస్తకం ఎత్తుకెళ్లారు. శంకర్‌పల్లి పోలీస్ పరిధిలోని మహాలింగపురం గ్రామానికి చెందిన నారాయణ, సత్తమ్మలు వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. అయితే, వారి కుమారుడికి పెళ్లవగా వేరే ఇంట్లో నివాసముంటున్నాడు. ఈక్రమంలో మంగళవారం ఉదయం అతడు అమ్మానాన్నల ఇంటికి వెళ్లి చూడగా.. ఇంటి తాళాలు విరగ్గొట్టి ఉండటం గమనించాడు. దాంతో వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వారు వెంటనే ఇంటికి చేరుకొని చూడగా.. రూ.10వేలు, 15 తులాల వెండి, భూమి పాసు పుస్తకం కనిపించలేదు. శంకర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో మేకలు మృత్యువాత

చౌదరిగూడ, జూన్ 25: వీధికుక్కల దాడిలో మేకలు మృతిచెందిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. లక్ష్మీదేవిపల్లికి చెందిన వడ్డే పెద్దనర్సింహులు సోమవారం రాత్రి తనకు చెందిన దొడ్డిలో మేకలను తోలాడు. అయితే, రాత్రివేళ ఊరిలో తిరిగే కుక్కలు దొడ్డిలోకి ప్రవేశించి మేకలపై దాడి చేశాయి. ఈమేరకు మూడు మేకలు మృతిచెందినట్లు బాధితుడు వాపోయాడు. దాదాపు రూ.40 వేల నష్టం వాటిల్లిందని పెద్దనర్సింహులు తెలిపాడు.

ఎక్సైజ్ దాడులు.. నాటు సారా స్వాధీనం

ఆమనగల్లు, జూన్ 25: ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల మండలాల పరిధిలో మంగళవారం ఎక్సైజ్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. పలు రహదారులపై వాహనాల తనిఖీ చేపట్టారు. గుడుంబ రహిత తెలంగాణలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశానుసారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ తెలిపారు. చారకొండ-ఇర్విన్ రహదారిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై నాటుసారా తరలిస్తున్న బ్రాహ్మణపల్లికి చెందిన వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకొని 6 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే నాటుసారా కేసులకు సంబంధించి మాడ్గుల మండలంలో ఐదు మందిని, తలకొండపల్లి మండలంలో ఒకరిని, కడ్తాల మండలంలో ఐదు మందిని ఆయా మండల తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఆమనగల్లు, జూన్ 25: ఆమనగల్లు పట్టణ సమీపంలోని కాటన్ మిల్ వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ముర్తుజపల్లి గ్రామానికి చెందిన కర్నాటి చెన్నారెడ్డి మంగళవారం టీవీఎస్‌పై ఆమనగల్లు పట్టణానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో కాటన్ మిల్ వద్ద జాతీయ రహదారి నుంచి ముర్తుజపల్లి రోడ్డు వైపు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన డీసీఎం వ్యాన్ టీవీఎస్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో టీవీఎస్‌పై ఉన్న చెన్నారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఏఎస్సై బాల్‌రెడ్డి సందర్శించి పంచనామా నిర్వహించారు.

పౌల్ట్రీ ఆస్తి పన్ను బకాయిలను రద్దు చేయండి

- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు రైతుల వినతి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 25: షాద్‌నగర్ మున్సిపాలిటీలో విలీనం చేసిన చటాన్‌పల్లి గ్రామ శివారులోని పౌల్ట్రీల ఆస్తి పన్ను బకాయిలను రద్దు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు పౌల్ట్రీ రైతులు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఎంపీ శేషయ్యనగర్‌లోని పౌల్ట్రీ రైతులు మంగళవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి సమస్యను వివరించారు. చటాన్‌పల్లి గ్రామ పంచాయతీ శివారులోని ఎంపీ శేషయ్యనగర్ పౌల్ట్రీ కాంప్లెక్స్‌ను సైతం 2011 ఆగస్టు 24న షాద్‌నగర్ మున్సిపాలిటీలో విలీనం చేశారని పేర్కొన్నారు. ఆస్తి పన్ను మినహాయింపులో ఉన్న పౌల్ట్రీకి పన్నులు చెల్లించాలని మున్సిపాలిటీ సిబ్బంది వెంటపడుతూ కోర్టులో కేసులు వేశారని తెలిపారు. ఈ విషయమై పలుమార్లు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకుని వెళ్లడంతో మున్సిపాలిటీలో ఉన్న పౌల్ట్రీ షెడ్లకు సైతం ఆస్తి పన్నును రద్దు చేస్తూ 2021 జూన్ 2న గత బీఆర్ఎస్ ప్రభుత్వం 92 జీవోను విడుదల చేసిందని వివరించారు. ఆ జీవోలో పాత బకాయిలను ప్రస్తావించకపోవడంతో బకాయిలను చెల్లించాల్సిందేనని మున్సిపల్ సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారని రైతులు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా లేని పౌల్ట్రీకి ఆస్తి పన్నును షాద్‌నగర్‌లోనే చెల్లించాలని మున్సిపాలిటీ అధికారులు వెంటపడుతున్నారని పేర్కొన్నారు. సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేయిస్తానని మంత్రి తుమ్మల హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో పౌల్ట్రీ రైతులు మాకినేని వెంకటనారాయణ, నువ్వుల శ్రీనివాస్‌రావు, కాపా వెంకటేశ్వర్‌రావు, అర్జున్‌రెడ్డి, మల్లికార్జునరావు, బండారు సతీష్, వైకుంఠ శరత్, దుర్గాప్రసాద్, కోటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.



మంత్రిని సన్మానిస్తున్న పౌల్ట్రీ రైతులు

నిరుపేదలకు అండగా ఉంటా : జడ్పీటీసీ

కడ్తాల్, జూన్ 25: నిరుపేదలకు, వివిధ కారణాలతో మృతిచెందిన బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని కడ్తాల జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా కడ్తాల మండలంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం దశరథ్ నాయక్ పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన కంబాలపల్లి జంగయ్య కుటుంబాన్ని జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ పరామర్శించారు. జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా బాధిత కుటుంబానికి రూ. 25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి భార్య బక్కమ్మకు మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, నాయకులు పాండు, మంగళపల్లి నర్సింహ, లాయక్‌అలీ, కృష్ణ, అంజి, శ్రీను, వెంకటేశ్, మహేశ్, పాండు, సురేశ్, శివ, రాములు, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్



హ్యాండ్ బుక్‌లు విడుదల చేస్తున్న ఎంపీపీ కృపేష్, సీడీపీవో శాంతిశ్రీ తదితరులు

పిల్లలను తీర్చిదిద్దడంలో అంగన్‌వాడీ టీచర్ల పాత్ర గొప్పది

- ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్

ఇబ్రహీంపట్నం, జూన్ 25: పిల్లలను అన్ని విధాలుగా తీర్చిదిద్దడంలో అంగన్‌వాడీ టీచర్ల పాత్ర ఎంతో గొప్పదని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఉప్పరిగూడ రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ కృపేష్ మాట్లాడుతూ పిల్లల్లో మంచి నడవడికతోపాటు గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడమనేది మంచి పరిణామమన ఆయన అన్నారు. అనంతరం సీడీపీవో జి.శాంతిశ్రీ మాట్లాడుతూ 0-8 సంవత్సరాల పిల్లల్లో ఫౌండేషనల్ స్టేజ్ గనుక.. వారికి కథలు, ఆలపాటలతో చదువు నేర్పించాలని ఆమె సూచించారు. అదేవిధంగా నూతన జాతీయ విద్యా విధానం-2020 ప్రకారం పాఠ్య ప్రణాళికలో మార్పులు తీసుకురావడం జరిగిందని ఆమె తెలిపారు. దీనిపైనే ఈ శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా టీచర్లకు వారు హ్యాండ్ బుక్‌లు విడుదల చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు తులసి, పల్లవి, సరళ, ప్రథమ్, ఎన్‌జీవో నుంచి మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి



షాబాద్ : మాట్లాడుతున్న శ్రీకాంత్

షాబాద్, జూన్ 25 : ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ఆయన షాబాద్‌లో మాట్లాడుతూ పేద, మధ్యతరగతి గ్రామీణ విద్యార్థులు అనేకమంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని, పరిస్థితులకు బయపడి వారి తల్లిదండ్రులు ప్రైవేటు స్కూల్లో చదివించడానికి మొగ్గు చూపుతున్నారన్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీసులు వసూలు చేస్తున్నారని అన్నారు. విద్యాశాఖకు మంత్రి కూడా లేరని, వెంటనే నియమించాలన్నారు. నేడు విద్యాసంస్థల బంద్‌కు సహకరించాలని ఆయన కోరారు. షాబాద్ నగర కార్యదర్శి విజయ్, ప్రవీణ్, నిఖిల్, మధు, మల్లేష్, లోకేష్, మోహన్ తదితరులు ఉన్నారు.



చేవెళ్ల : మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

పాఠశాలల బంద్‌కు సహకరించాలి

చేవెళ్ల : సర్కారు బడుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేడు రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు నిచ్చిందని, బంద్‌కు అందరూ సహకరించాలని ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి మహిపాల్ కోరారు. చేవెళ్లలో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేసి, పాఠశాలల్లో బుక్స్, యూనిఫామ్ అమ్మకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు అవకతవకాలపై విచారణ జరిపించాలన్నారు. నాయకులు రాఘవేందర్, ప్రేమ్. పవన్, రేవంత్, ప్రవీణ్ తదితరులున్నారు.

ఫీజుల నియంత్రణకు కృషి చేయాలి

ఆమనగల్లు : ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు సమగ్ర చట్టం రూపొందించి అమలు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు గోరటి భరత్, లండం మల్లేశ్, నగర కార్యదర్శి పురుగుల శివలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆజమాయిషీ, నియంత్రణ లేక ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఫీజుల దోపిడీకి తెరలేపారని ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడడంతో పాటు వారి చదువులపై ప్రభావం చూపుతుందన్నారు. విద్యార్థులకనుగుణంగా అన్ని విద్యాసంస్థల్లో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాల విక్రయిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నరేశ్, అభి, శివ, సుమన్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాల విక్రయం

శంషాబాద్ : నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థిసంఘం నాయకులు ప్రణయ్ డిమాండ్ చేశారు. శంషాబాద్‌లోని పలు ప్రైవేటు పాఠశాలలను ఎస్ఎఫ్ఐ యూనియన్ సభ్యులు పరిశీలించారు. కొన్ని పాఠశాలల్లో నిబంధనలను వ్యతిరేకిస్తూ పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నారన్నారని, పుస్తకాల విక్రయం ఆపకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కౌశిక్, అర్జున్, ప్రసాద్, వంశీ, సాయి తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు : మాట్లాడుతున్న భరత్, శివ, మల్లేశ్

శంషాబాద్ డీసీపీకి సన్మానం



డీసీపీ రాజేశ్‌ను సన్మానిస్తున్న కౌన్సిలర్ జాంగీర్‌ఖార్ తదితరులు

శంషాబాద్, జూన్ 25 : శంషాబాద్ డీసీపీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాజేశ్‌ను నాలుగో వార్డు కౌన్సిలర్ జాంగీర్‌ఖాన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం డీసీపీ రాజేశ్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజాప్రతినిధులు, స్థానికులు సహకరించాలని కోరారు.

సబితారెడ్డిని విమర్శించే అర్హత ఎంపీపీకి లేదు

మహేశ్వరం, జూన్ 25 : మహేశ్వరం ఎంపీపీ సునీత అంద్యానాయక్‌కు ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డిని విమర్శించే కనీస అర్హతకూడా లేదని బీఆర్ఎస్ మహేశ్వరం మండలాధ్యక్షుడు ఆంగోత్ రాజునాయక్ అన్నారు. మంగళవారం మహేశ్వరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహేశ్వరంలో ఎమ్మెల్యే అండదండలతో బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించడంలో ఏమాత్రం వాస్తవంలేదని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ భూములను కబ్జా చేసినట్లయితే.. ఎంపీపీ అధికార కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారని, కబ్జాలపై విచారణకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. అనునిత్యం ప్రజాసేవకే అంకితమైన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన అన్నారు. అదేవిధంగా మన్‌సాన్‌పల్లిలో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో అంతా ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారమే కేటాయింపులు జరిగాయని, అలా కాకుండా ఎంపీపీ దృష్టికి ఏమైనా అవకతవకలు వస్తే విచారణకు అధికారులను ఆదేశించాలని ఆయన అన్నారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కె.చంద్రయ్య, ఎం.నవీన్, ఎన్. సుధీర్‌గౌడ్, రాజునాయక్, ఆనందం, ఆదిల్‌అలీ, కృష్ణ, సలీం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజునాయక్

ఇంటి నిర్మాణానికి ఉప్పల చేయూత

తలకొండపల్లి , జూన్ 25: మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికిచెందిన మీసాల మైసయ్య ఇంటి నిర్మాణానికి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. ఆర్థిక ఇబ్బందులతో మైసయ్య ఇంటి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఉప్పల వెంకటేశ్ ను కలిసి తన బాధను విన్నవించగా స్పందించి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరీయల్‌ను సమకూర్చారు. మంగళవారం ట్రస్ట్ సభ్యులు మైసయ్యకు మెటీరీయల్ ను అందజేశారు. పేదల ఇళ్ల నిర్మాణానికి ట్రస్ట్ ద్వారా చేయూతనందిస్తున్నట్లు వెంకటేశ్ పేర్కొన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇళ్లు నిర్మించి వారి సొంతింటి కలను సాకారం చేయాలన్నారు. ఎంపీపీ నిర్మలశ్రీశైలం గౌడ్, నాయకులు యెన్నం మోహన్‌రెడ్డి, మల్లేశ్, మధు, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ యాదయ్యకు ఘన నివాళి

కడ్తాల్, జూన్ 25: ముద్విన్ మాజీ సర్పంచ్ ఈర్లపల్లి యాదయ్య సేవలు చిరస్మరణీయమని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. కడ్తాల మండలం ముద్విన్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఈర్లపల్లి యాదయ్య మృతిపట్ల వారు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం కడ్తాల మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు పోతుగంటి అశోక్ ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. యాదయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. యాదయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బీక్యనాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, సేవాదల్ మండల అధ్యక్షుడు గురిగిళ్ల లక్ష్మయ్య, ఎస్సీ సెల్ బ్లాక్ అధ్యక్షుడు రామకృష్ణలు పేర్కొన్నారు. యాదయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, ఈర్లపల్లి మల్లేశ్, మంకిశ్రీను, జహంగీర్‌అలీ, శంకర్, మల్లేశ్‌గౌడ్, యాదయ్య, బుచ్చయ్య, జవహర్ లాల్ నాయక్, హీరాసింగ్ తదితరులు పాల్గొన్నారు.



యాదయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గ్రామ సమీపంలోని
పౌల్ట్రీఫాంను మూసివేయండి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న దేవేందర్

షాబాద్, జూన్ 25 : మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామ సమీపంలో గల తాజ్ పౌల్ట్రీఫాంను మూసివేయాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కన్వీనర్ అల్లి దేవేందర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం గ్రామస్థులతో కలిసి తహసీల్దార్ అన్వర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాజ్ పౌల్ట్రీఫాం నుంచి దుర్వాసన రావడంతో పాటు ఈగలు గ్రామంలోకి వస్తున్నాయని, అనారోగ్యంతో చిన్న పిల్లలు, వృద్ధులు వాంతులు, విరోచనాలులకు గురవుతున్నారని అన్నారు. పౌల్ట్రీఫాం యాజమాన్యంతో మాట్లాడి వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పౌల్ట్రీఫాం వద్ద ఆందోళన చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు నర్సింహ, మురళి , రఘురాం, శ్రీధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం, షూస్ పంపిణీ



ఇబ్రహీంపట్నం : విద్యార్థులకు షూస్ పంపిణీ చేస్తున్న జయశ్రీ తదితరులు



మొయినాబాద్ రూరల్ : యూనిఫాం పంపిణీ చేస్తున్న రాజు

ఇబ్రహీంపట్నం, జూన్ 25: విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రిటైర్డ్ ఉపాధ్యాయురాలు జయశ్రీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎలిమినేడు ప్రాథమిక పాఠశాల, హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో 110 మంది విద్యార్థులకు షూస్, టై బెల్టులు అందజేశారు. స్వగ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తన వంతుగా సహకారం అందించాలనే ఉద్దేశ్యంతో వీటిని పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల అభ్యున్నతికి తనవంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నానని మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన జీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నాయకుడు గరుగు రాజు ముదిరాజ్ అన్నారు. సొంత డబ్బులతో గ్రామంలోని చిలుకూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 152 విద్యార్థులకు 5వ తరగతి నుంచి పదవి తరగతి వరకు అవసరమయ్యే నోటు పుస్తకాలు, క్రీడాదుస్తువులు పంపిణీ చేశారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు వచ్చిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

యాచారం : ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని మండలంలోని నజ్దిక్‌సింగారంనకు చెందిన హన్‌మాన్‌యూత్ సభ్యులు కోరారు. గ్రామంలోని పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు.